

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి నూకతాటి ఈశ్వరుడు అన్నారు. స్థానిక పెద్ద వీధి అంబేద్కర్ విగ్రహానికి షెడ్ నిర్మాణ పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాలకు అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. టిడిపి ప్రతిపాడు నియోజకవర్గ ఇనఛార్జి వరుపుల రాజా ఆర్థిక సాయంతో షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లాని శీను, బొండాడ అప్పారావు, కూసి కరుణ్, తాటిపాక సత్యనారాయణ, చింతపల్లి చినఅప్పారావు, సారిక నూకరాజు, బల్లం సూరిబాబు, కొరమాటి రవి, బల్లం శ్రీను మాస పౌలు ఉన్నారు.

టీచర్ల బదిలీలపై గందరగోళం

- 8 ఏళ్ల కనీస సర్వీస్ తప్పనిసరి
- 14 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జనవరి మొదటి వారానికి పూర్తి



ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

ఉపాధ్యాయుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో కొంత గందరగోళం నెలకొంది. అధికారులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖాళీలపై ఆదివారం ఎంఇఒలు, పాఠశాల హెచ్ఎంలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ఖాళీ పోస్టులు ఉన్నాయో దానిపై అధికారులతో స్పష్టత లేకపోవడంతో, నేడు నిర్వహించే సమీక్ష సమావేశంతో లెక్కలు తేలుతున్నాయి. ఇప్పటికే పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలయింది. ఆ మేరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ మాత్రం నెల రోజుల్లోనే బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తామని చెబుతున్నా, ఈ ప్రక్రియ పూర్తి రెండు నెలలు పట్టొచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో కాక ప్రథమార్థంలో బదిలీల నిర్వహిస్తే మంచిదని పలు ఉపాధ్యాయ సంఘాలు సూచిస్తున్నాయి. కాకినాడ జిల్లాలో 1200 ప్రభుత్వ పాఠశాలల్లో 6,000 మంది ఉపాధ్యాయుల విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వీరి సంఖ్య 16 వేల మందికి పైగా ఉంది. జిల్లాలో 3 నుంచి 10వ తరగతి సబ్జెక్ట్ టీచర్లు అదనంగా అవసరమని విద్యాశాఖ అంచనా వేసింది. ప్రభుత్వం జారీ చేసిన జిఒ 187లో సవరణలు చేయాలని ఉపాధ్యాయుల సూచిస్తున్నారు. ఏ పద్ధతిలోనైనా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులకు పాయింట్స్ కేటాయించాలని కోరుతున్నారు. 98 రోల్ పైన ఉన్న యుపి పాఠశాలలో కదిలిస్తున్న ఎస్‌జిటిలకు, 98 రోల్ లోపు ఉన్న యుపి పాఠశాలలో కదిలిస్తున్న స్కూల్ అసిస్టెంట్‌కు ప్రత్యేక పాయింట్స్ కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత బదిలీల సందర్భంగా ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలు తలసేమియా, జువైనల్ డయాబెటిస్, హార్ట్‌లో హోల్ ఉన్నవారికి, ప్రిఫరెన్స్ క్యాటగిరీలుగా పరిగణించడంతో పాటుగా, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు స్పెషల్ పాయింట్స్ కేటాయించాలని కోరుతున్నారు. 92 లోపు రోల్ ఉన్న ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పిఇటిలకు స్పెషల్ పాయింట్స్ కేటాయించడంతోపాటు, సబ్జెక్టు కన్వర్షన్ అయిన వారిపై స్పష్టత ఇవ్వాలని ఉపాధ్యాయుల కోరుతున్నారు. బదిలీలు సక్రమంగా జరిగేలా ఏ ఖాళీ పోస్టులను బ్లాక్ చేయకూడదని, ఉపాధ్యాయుల వాస్తవికతను, వారి సమస్యలను గ్రీవెన్స్‌ను బదిలీల్లో తప్పక పరిగణనలోకి తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి, వారికి కూడా వెంటనే బదిలీలు ప్రమోషన్స్ నిర్వహించేలా చూడాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అసంబద్ధాలను సవరించాలి



బదిలీల సందర్భంగా జిఒ నెంబర్187లో ఉన్న అసంబద్ధాలను సవరించి ఉపాధ్యాయులను బదిలీలను చేపట్టాలి. అలాగే ఉపాధ్యాయుల సమస్యలను పరిగణంలోకి తీసుకోవాలి. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించి, బదిలీలు ప్రమోషన్లు నిర్వహించాలి. బదిలీలో ఏ పద్ధతిలో సర్దుబాటు జరిగినా ఉపాధ్యాయులకు పాయింట్స్ కేటాయించాలి.

- టి.చక్రవర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆలిండియా టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణం క్రీడల్లో ఖ్యాతి పొందిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక లిటరరీ అసోసియేషన్‌లో గిష్టా, లిటరరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ఆదివారం సాయంత్రం లిటరరీ అసోసియేషన్ కార్యదర్శి పసల పద్మ రాఘవరావు అధ్యక్షతన జరిగిన సీనియర్ టెన్నిస్ క్రీడాకారుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు మహేష్ భూపతి పెద్దాపురం వాడు కావడం పట్టణానికి గర్వకారణమన్నారు. నేటికీ ఎంతోమంది క్రీడాకారులు జాతీయస్థాయి టెన్నిస్ పోటీల్లో పాల్గొని విజేతలగా పెద్దాపురం పట్టణానికి ఖ్యాతిని తెస్తున్నారన్నారు. దీనినియ దృష్టిలో పెట్టుకుని పెద్దాపురం పట్టణంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు క్రీడా స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు గత ప్రభుత్వ హయాంలోనే కృషి ప్రారంభించానన్నారు. క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా టెన్నిస్ క్రీడాకారులుగా ఎన్నో విజయాలు సాధించి, విశేష సేవలు అందించిన సీనియర్ క్రీడాకారులను పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సభలో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, జాస్తి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నేటి నుంచి క్వార్టర్ ఫైనల్స్

ఈ నెల 10న ప్రారంభమైన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో సింగిల్స్ విభాగంలో రౌండ్ పోటీలు ముగిశాయని, 12వ తేదీ నుంచి క్వార్టర్స్ ఫైనల్స్ నిర్వహించబడతాయని టెన్నిస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజా సూరిబాబు రాజు, పసల పద్మ రాఘవరావు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా 35 ప్లస్, 45 ప్లస్, 55 ప్లస్, 65 ప్లస్, 70 ప్లస్ డబుల్స్ పోటీలతో పాటు సింగిల్స్ పోటీల్లో కూడా క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తి వేయాలని డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ

శాంతియుతంగా ప్రజాహితం కోసం ఉద్యమాలు చేస్తున్న వామపక్ష, దళిత, ప్రజాసంఘాలపై అక్రమ కేసులు బనయించడాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దీనిపై అన్ని రాజకీయ, దళిత, ప్రజా సంఘాలతో మాట్లాడి రెండు రోజుల్లో జిల్లా ఎస్‌పి, జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటిని తగలబెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని, కేసులు నమోదు చేయాలని కాకినాడలో స్థానిక ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా వామపక్ష, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తే అక్రమ కేసులు బనాయిస్తారా అని ప్రశ్నించారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న వామపక్ష నాయకులు తోకల ప్రసాద్, పలివెల వీరబాబు, జె.వెంకటేశ్వరరావు, గుబ్బల ఆదినారాయణ, దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, పిట్టా వరప్రసాద్, పిఎస్.ఆర్ కుమార్ తదితరులపై సంబంధం లేని సెక్షన్లు బనయించారని మధు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల ఇళ్లపై ప్రయివేటు వ్యక్తుల దౌర్జన్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

30 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలపై ప్రైవేటు వ్యక్తుల దౌర్జన్యం తగదని గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామానికి చెందిన పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1995కు పూర్వం నుంచి గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో 28 కుటుంబాలకు చెందిన పేదలు ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామన్నారు. ఆ స్థలాలు తమవి అంటూ గ్రామానికి సంబంధం లేని ఒక వ్యక్తి వచ్చి స్థలాలు ఖాళీ చేయాలని దౌర్జన్యానికి దిగుతున్నారని అరదాడి ఆదినారాయణ, జయన్నారాయణ, పినపోతు గోవరాజు, మల్లాడి వీరబాబు, కామాడి బాబి విలేకరుల వద్ద మొరపెట్టుకున్నారు. 1995కు పూర్వం గ్రామానికి చెందిన ఒక దాత గ్రామ పెద్దలకు ఇచ్చిన రెండెకరాల స్థలంలో పెద్దల సహకారంతో 28 గృహాలు నిర్మించుకున్నామని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల 8 నెలల నుంచి గాడిమొగ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈ స్థలాలు వారికి ఖాళీ చేయండి అంటూ తమ కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళలు అరదాడి దుర్గ, చెక్క ప్రేమావతి, మల్లాడి కామేశ్వరి, కామాడి సత్యవతి, ఓలేటి దుర్గ, అంకాడి దేవకి, మాట్లాడారు. గ్రామపంచాయతీ ద్వారా పదేళ్ల క్రితం రహదారులు నిర్మించి, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సదుపాయం కల్పించారని, రోడ్లు వేసేటప్పుడు ఏ ఒక్కరూ ఈ స్థలాలు వారివి అని రాని వ్యక్తులు వాటిని అభివృద్ధి చేసుకుని ఇల్లు నిర్మించుకున్న తర్వాత ఖాళీ చేయండని దౌర్జన్యానికి దిగుతున్నారని వారు తెలిపారు. తమ గృహాలకు ఇంటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఇటీవల ఓఎన్‌జిసి మత్స్యకారులకు ఇచ్చిన నష్ట పరిహారాన్ని 41 మందికి రాకుండా చేశారని, దీనివల్ల తమ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. ఆ వ్యక్తులు యొక్క దౌర్జన్యాలను అరికట్టి తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.



ఇంటి పన్ను, కరెంటు బిల్లులు చూపిస్తున్న బాధితులు

వర్షంతో నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి-కోటనందూరు

మాండూస్ తుపాను ప్రభావంతో కోటనందూరులో శుక్ర, శని వారాల్లో తక్కువ వర్షాలు కురిసిన ఆదివారం కుండపోత వర్షం కురవడంతో వరి పొలాలు నీట మునిగాయి. మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో 9500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. అల్లిపూడి, కాకరాపల్లి, పి..కొట్టం, కె.కొట్టం, కోటనందూరు, జగన్నాధపురం పరిసర ప్రాంతాల్లో వరికోతలు కోశారు. కోతలు కోసిన పంటలన్నీ పొలాల్లోనే ఉండటంతో వర్షాలకు తడిసి ముద్దయి ధాన్యం రాలిపోతోందని రైతులు విచారం వ్యక్తం చేశారు. ఒక్కొక్క ఎకరానికీ రూ.15,000 పైగా పెట్టుబడి పెట్టి కష్టపడి పండించిన పంట నీట మునిగిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షపు నీటితో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సత్యనారాయణ, సూరిబాబు, సత్తిబాబు నాగార్జున, పలువురు కోరుతున్నారు.



పనలపై ఉన్న వరి చేను

మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించాలి

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

తుపాను వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించాలని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ కోరారు. మత్స్యకార తీరప్రాంతాన్ని వర్షాన్ని సైతం పట్టించుకోకుండా మత్స్యకారులు బాగు కోసం వారి పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి తెలిపేందుకు స్థానిక మత్స్యకార నాయకులతో కలిసి ఆదివారం సముద్ర కోతకు గురవుతున్న సుబ్బంపేట, మాయపట్నం ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో కొత్తపల్లి మండల మత్స్యకార తీరప్రాంత ప్రజలంతా భయందోళనలో ఉన్నారని తెలిపారు. ఉప్పాడ బీచ్ రోడ్డు మార్గం చాలా అధ్వానంగా ఉందన్నారు. తుపాను వచ్చినప్పుడల్లా ఎదో అలా పైపైనే రాళ్లు సర్దేసి పోతున్నారు తప్పితే పట్టించుకోవడం లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఐఐటి నిపుణుల సలహాల మేరకు నేమాం నుంచి తుని నియోజకవర్గం అద్దరిపేట వరకూ మత్స్యకారుల సంక్షేమం కోసం తీరప్రాంతం అంతా సముద్ర కోతకు గురి కాకుండా ఉండడానికి సుమారు రూ.350 కోట్లతో జియోట్యూబ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకుంటే నిధులు వస్తాయని, దీనికి సంబంధించిన ఫైల్ కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉందని, ఇవేమీ చేయకుండా పార్లమెంట్‌లో మాట్లాడేసామని గొప్పలు చెప్పుకోవడం కాదన్నారు. మత్స్యకార గ్రామాల్ని, ఇక్కడ తీరప్రాంత ప్రజలను కాపాడవలసిన భాద్యత ప్రభుత్వానికి ఉండాలని అన్నారు. తుపాను వచ్చినప్పుడు వేటకు వెళ్ళవద్దని చెబుతున్నారు తప్పితే వారికి రూ.పది సాయం చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, సూరాడ రాజు, సూరాడ నాగేశ్వర రావు, వాసపల్లి ఉపమాక, చొక్కా దావీద్, చోడిపల్లి ప్రసాద్, భూషణం, కొవ్వూరు రాంబాబు, బాదిన నాగేశ్వరరావు, సీకోటి నానాజీ, చోడిపల్లి అప్పన్న, జగన్నాథం, సత్యవతి పాల్గొన్నారు.



తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

డ్యాన్స్ పోటీల్లో కోట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సామర్లకోట

ఆలిండియా డ్యాన్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెస్ట్రన్ డాన్స్ పోటీల్లో సామర్లకోట నటరాజ్ డాన్స్ అకాడమీకి చెందిన వి.విజయ్, బి.జగదీశ్వరి గోల్డ్ మెడల్ సాధించగా డి.మోహన్ సిరి సిల్వర్ మెడల్, సోహమ్ జేయిన్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు నటరాజ్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ వి.శివశంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక నటరాజు డాన్స్ అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివ శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో భాగంగా 10 జిల్లాల నుంచి తాడేపల్లిగూడెంలోని టిటిడి కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు విజయవంతంగా జరిగాయని నటరాజ్ అకాడమీకి ముగ్గురు విద్యార్థులు గోల్డ్, సిల్వర్ బహుమతులు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలలోని విజయం సాధించిన వారు ఈ నెల 28, 29, 30 తేదీలలో తిరుపతిలో జరగబోయే నేషనల్ కాంపిటీషన్‌లో పాల్గొంటారని అన్నారు. నేషనల్ పోటీలలో విజయం సాధించిన వారు 2024 పారిస్‌లో జరిగే వెస్ట్రన్ డాన్స్ ఒలింపిక్ పోటీలకు ఎంపికవుతారని అన్నారు. రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలకు ఆట 5 కొరియోగ్రాఫర్ నాని, కె.రాజశేఖర్ డాన్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. డాన్స్ మరింతగా అభివృద్ధి చెందేలా చూడాలని, జిల్లాలోని అన్ని స్కూల్స్, కాలేజీ విద్యార్థులకు డాన్స్ శిక్షణను ఇచ్చి ఒలింపిక్స్‌లో పోటీ చేసేటట్టుగా ప్రభుత్వాలు సహకరించాలని డాన్స్ మాస్టర్ శివశంకర్ కోరారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జాతీయ పోటీలకు రుచి ఎంపిక


ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర స్థాయి 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పట్టణంలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్న పి.రుచి రూపొందించిన వరి పంట పరిరక్షణలో పక్షుల పాత్ర అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. ఈ నెల 9, 10, 11 తేదీలలో తిరుపతి జిల్లా గూడూరులో ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పి.రుచి, గైడ్ టీచర్ కోమలి ప్రతాప్, జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, అకడమిక్ సమన్వయకర్త కె.వెంకట్రావుకు రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్.కె రోజా, ఎస్‌సిఇఆర్‌టి డైరక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, అప్‌కాస్ట్ సభ్య కార్యదర్శి డాక్టర్ వై.అపర్ణ, ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వి.పెంచలయ్య, అప్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.దిల్లేశ్వరరావు ద్వారా బహుమతులు తీసుకున్నారు. విద్యార్థిని జిల్లా విద్యాశాఖాధికారి దాట్ల సుభద్ర, ఉప విద్యాశాఖాధికారి ఆర్.జె.డేనియల్ రాజు అభినందించారు.



రుచిని అభినందిస్తున్న మంత్రి రోజా

కార్టూ'నిజం'



స్కూల్ కాంపోజిట్ నిధులు నిల్..

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విద్యుత్తు బిల్లులు, సుద్ద ముక్కలు, స్టేషనరీ బిల్లులు, రవాణా ఛార్జీలు నెలనెలా ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. నెలకు రూ. 5వేల పైనే నిర్వహణ ఖర్చులు అవుతున్నాయి. సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. నిర్వహణ గ్రాంటు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తోందో స్పష్టత లేదని పిఠాపురం మండలంలోని ఒక పాఠశాల హెచ్ఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అనేకమంది ఉపాధ్యాయులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై సుమారు 6 నెలలు గడుస్తున్నా స్కూల్ కాంపోజిట్ గ్రాంటు నేటికీ విడుదల చేయలేదు. దీంతో నిర్వహణ కష్టంగా మారిందని ప్రధానోపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 1284 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1,63,203 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది జూన్ 12 న పాఠశాలలు పున్ణ ప్రారంభమయ్యాయి.



నిధులు విడుదల ఇలా..

పాఠశాలలకు ప్రభుత్వం ఏటా ప్రారంభంలోనే సర్వశిక్షాబియాన్ (ఎస్ఎస్ఎ) ద్వారా స్కూల్, మేనేజ్ మెంట్, టీచర్స్ గ్రాంట్లు, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) కింద ఇతరత్రా నిధులు విడుదల చేస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు 1 నుంచి 15 లోపు ఉన్న స్కూళ్లకు రూ.12,500, 15 నుండి 100 లోపు పిల్లలున్న వాటికి రూ.25 వేలు, 100 నుండి 250 లోపు రూ.50 వేలు, 250 నుండి వెయ్యి మంది విద్యార్థులున్న స్కూళ్లకు రూ.75 వేలు నిధులను విడుదల చేస్తారు. ఈ నిధులతో సుద్ద ముక్కలు, బ్లాక్ బోర్డులు, డస్టర్లు వంటివి కొనుగోలు చేయడంతో పాటు తలుపులు, కిటికీల మరమ్మతులు, స్వాతంత్య, గణతంత్ర వేడుకలు, బడిబాట, ఇతరత్రా విద్యా కార్యక్రమాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు వంటివి చేయాల్సి ఉంటుంది.

విడుదలలో జాప్యం

సొంత నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. నిధుల్లేక పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులు కూడా చేపట్టలేని దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. వివిధ పాఠ్యాంశాల బోధనకు డయాగ్రమ్‌లు, చార్టులు అవసరం కావడంతో పాఠశాలల్లో వీటి కొరత వేధిస్తోంది. 31 నుంచి 100 మంది పిల్లలు ఉన్న 519 పాఠశాలలకు రూ.1,29,75,000, 101 నుంచి 250 మంది పిల్లలు ఉన్న 390 పాఠశాలలకు రూ.1,95,00, 000, 251 నుంచి 1000 మంది పిల్లలు ఉన్న 185 పాఠశాలలకు రూ.1,38,75,000, 1000 మంది పైనే ఉన్న 12 పాఠశాలలకు రూ.12 లక్షలు మొత్తంగా రూ.4.92 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం కొత్త విధానంలో బిల్లులను విడుదల చేస్తున్న మూలంగా వస్తున్న సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు హెచ్ఎంలు తెలిపారు.

కష్టంగా నిర్వహణ

నిధుల లేమితో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కష్టంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మూడు నెలలుగా పైసా కూడా విడుదల చేయకపోవడంతో కనీసం సుద్ద ముక్కలను కూడా కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొందని ఉపాద్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో జేబు నుంచి ఖర్చు పెట్టుకుని నెట్టుకొస్తున్నామని పలువురు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.

అన్ని బిల్లులూ అప్‌లోడ్ అయ్యాయి

స్కూల్ కాంపోజిట్ గ్రాంటుకు సంబంధించి బిల్లులు అన్ని ఇప్పటికే అప్‌లోడ్ చేసాం. చాలామంది ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ ఏడాది నుంచి కొత్తగా పిఎఫ్ఎంఎస్ ఖాతాల్లో వాటిని వేసాము. ఖర్చు చేసిన సొమ్ముకు సంబంధించి బిల్లును అప్‌లోడ్ చేస్తేనే రిలీజ్ అవుతాయి.

పద్మావతి, ఫైనాన్సియల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, విద్యాశాఖ, కాకినాడ జిల్లా.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలి

ప్రజాశక్తి-కాజులూరు

యానాం ద్రాక్షారామ రహదారిలో మద్యం సేవించి బైకులు నడుపుతున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుదోనని ముంచికొస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో మలుపులు ఎక్కువగా ఉండడంతో పాటు చెంతనే ప్రధాన పంట కాలవ ఉండడంతో ఒక్కొక్కసారి వాహనదారులు పంట కాలువల్లోకి దూసుకుపోతున్నారు. యువకులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి యానాంలో మద్యం తక్కువ ధరకు లభిస్తుందడంతో విచ్చలవిడిగా సేవిస్తూ వాహనాలు నడుపుతూ ఎదుటి వాహన దారులను ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాలు నివారించాలని పలువురు వాహనదారులు వాపోతున్నారు.


తీర్థంలో యాత్రికుల రద్దీ

దుర్గమ్మ తీర్థానికి యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గండేపల్లి

మురారి కనక దుర్గమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ తీర్థానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా యాత్రికులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మాండోస్ తుపాను ప్రభావం వలన అర్ధరాత్రి నుంచి వర్షం కురవడంతో ఈ ఏడాది యాత్రికుల రద్దీ తగ్గటమే కాక రహదారి వెంబడి రోడ్డు బురదగా మారి ద్విచక్ర వాహనాలు జారిపడి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ గణేష్ కుమార్, కిర్లంపూడి ఎస్ఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


పతకాలతో చిన్నారి

అమలాపురం షాదీఖానాలో ఆదివారం నిర్వహించిన థర్డ్ ఎపి స్టేట్ ఇన్విటేషన్ కరాటే టోర్నమెంట్‌లో నగరంలోని కవలగొయ్యికి చెందిన విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. తొమ్మిది సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల విభాగంలో పంచికట్ల లక్ష్మీ లావణ్య, పంచికట్ల హేమశ్రీ, పంచికట్ల సుకన్య, జి.నాగదుర్గతేజ గోల్డ్ మెడల్ సాధించారు. వారిని కరాటే మాస్టర్ పంచికట్ల శ్రీను అభినందించారు.

బస్టాప్ ఏర్పాటు చేయరూ..

ప్రజాశక్తి-జగ్గంపేట

కళాశాల సమీపంలో బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని జగ్గంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు కోరుతున్నారు. నియోజవర్గమైన జగ్గంపేటలో డిగ్రీ కళాశాల టౌన్‌కు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు నాలుగేళ్లుగా పలు ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ నాయకులకు విద్యార్థి సంఘాల నాయకులు మొరపెట్టుకున్నా ఇప్పటికీ ఫలితం లేకపోయింది. సుమారు 400 మంది చదువుతున్న కళాశాలలో 200 మందికి పైగా 10 నుంచి 25 కిలోమీటర్లు దూరం నుంచి బస్సులలో ప్రయాణించి విద్యభాస్యం కొనసాగించుతున్నారు.

రోజూ 25 కిలోమీటర్లు ప్రయాణించాలి

నేను జగ్గంపేట డిగ్రీ కళాశాలలో గత రెండేళ్లుగా చదువుతున్నాను. రోజూ 25 కిలోమీటర్ల దూరం నుంచి పయనించి వస్తున్నాను. రెండుబస్సులు మారాల్సి ఉంది. జగ్గంపేట టౌన్‌కు ఒక బస్సులో ప్రయాణించగా అక్కడ నుంచి కళాశాలకు చేరుకోవాలంటే గోకవరం వెళ్లే మరో బస్సు మారాల్సి వస్తుంది. కళాశాల దగ్గర బస్సు ఆపనంటే రెండు కిలోమీటర్లు దూరం కాలినడక వెళ్లాల్సి వస్తోంది.

- వానపల్లి బద్రి, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, డిగ్రీ విద్యార్థి

కళాశాల వద్ద బస్సు ఆగడం లేదు

మా ఊరు జగ్గంపేట మండల పరిధిలో ఉన్న మల్లిసాల కళాశాలకు సుమారు పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. గోకవరం బస్సు డిపో బస్సు ఎక్కి జగ్గంపేట కళాశాలకు చేరుకోవాలి. టౌన్‌కు వెళ్లకుండానే కళాశాల వస్తుంది. కానీ అక్కడ ఆపడానికి ఆర్‌టిసి బస్సు సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా డిగ్రీ చదువుతున్నాను.

- అయితి చిన్న జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామం



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హక్కులతో పాటు బాధ్యతలూ నెరవేర్చాలి

ప్రజాశక్తి -కొత్తపేట

హక్కులతో పాటు ప్రతి పౌరుడు తన బాధ్యతలను కూడా నెరవేర్చాలని న్యాయవాదులన్నారు. సీనియర్ న్యాయవాదులు ఎ.ఆదినారాయణ, డి.బాల ప్రతాప్ అన్నారు. విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తపేట నందు ఎన్ఎస్ఎస్ అధికారి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానతులుగా. సీనియర్ న్యాయవాదులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మనిషికి భారత రాజ్యాంగం కల్పించినటువంటి మానవ హక్కులు ఉన్నాయన్నారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించే హక్కు ఆస్తి హక్కు, విద్యను పొందే హక్కు కలిగి ఉన్నారని అన్నారు. ఏ పౌరుడైనా ఒకరి హక్కులకు భంగం కలిగిస్తే, వారి హక్కులను హరిస్తే రాజ్యాంగ చట్టం ప్రకారం వారి మీద చర్య తీసుకునే హక్కు న్యాయస్థానాలకు ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి తమ హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించు కునే అధికారం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎన్.నాగేశ్వరరావు , చంద్రశేఖర్, సూర్యారావు, ఎం.శ్రీనివాస్, ఎ. కాంతరాజు, కె.సత్యం తదితరులు, విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం మానవ హక్కులు కాపాడుకోవాలని, మానవ హక్కులను హరించరాదని ర్యాలీ నిర్వహించారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో జెవివి నాయకులు

ఉత్సాహంగా చెకుముకి పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జెవివి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు దానవాయిపేటలోని భాష్యం పబ్లిక్ స్కూల్లో ఉత్సాహంగా సాగాయి. మండల స్థాయి విజేతలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విభాగాల్లో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో భూపతిపాలెం ఎంపిఆర్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, రఘుదేవపురం జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ, శ్రీ కంటిపూడి రామారావు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రయివేటు పాఠశాలల విభాగంలో దివాన్ చెరువు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, కాతేరు శ్రీ సద్గురు విద్యాలయం విద్యార్థులు ద్వితీయ, రాజమహేంద్రవరం శ్రీ షిరిడీసాయి విద్యానికేతన్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అనతరం జెవివి నాయకులు సిహెచ్.శ్రీరాములు మ్యాజిక్ షో నిర్వహించారు.

వీడని వర్షం.. తప్పని నష్టం..

ఆందోళనలో వరి రైతులు, ఒడ్డుకు మత్స్యకారుల బోట్లు

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్


ఒడ్డుకు చేరిన బోట్లు

రెండు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోపంట నష్టం తప్పే లేదు. ఒకవైపు వర్షం మరోవైపు చలిగాలు తీవ్రతతోప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కాకినాడ జిల్లామత్స్యకార బోట్లు ఒడ్డుకు చేరుకున్నాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికిజిల్లా వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ పనులు చేసుకునేందుకు బయటకు రాకుండా ఒక పక్కన చలిగాలు తీవ్రతతో మనుషులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. వర్షాలు ఇలాగే కొనసాగితే పంట నష్టం మరింత పెరుగుతుందని, అటు అధికారులు, ఇటు నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ జిల్లాలో ఒకఒక లక్ష 38 వేల ఎకరాల్లో వరిని సాగు చేయగా 500 ఎకరాల్లో కోత కోసిన చేను పనుల మీద ఉందని, 150 ఎకరాల్లో వరి సాగు పూర్తిగా నేలను తాగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు.ఇది కేవలం శనివారం నాటికి సంబంధించిన వివరాల అధికారంలో వెల్లడించారు.మరో రెండు రోజుల వివరాలు రావలసిన తరుణంలో నష్టం ఎంత ఉంటుందో అంచనా వేయలేకపోతున్నారు. ప్రస్తుతం 75 వేల టన్నుల ధాన్యం బరకాల కింద ఉండగా దీనికి ఎటువంటి నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు.అయితే కళ్ళాలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు కాసే వరకు కోతల కోయొద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.

ఆకట్టుకున్న కళాకారుల నృత్య నీరాజనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్


కళాకారుల నృత్య ప్రదర్శన

కాకినాడలో శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో ఆదివారం కళాకారుల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. శాస్త్రీయ నృత్యం భతనాట్యం, కూచిపూడి నృత్య భంగిమలు, సాక్షాత్ నటరాజ తాండవాన్ని కన్నులకు కట్టినట్టు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాకినాడ శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య నాట్య గురువుల సారథ్యంలో 10వ సంవత్సరం ఈ నృత్య నీరాజనం నిర్వహిస్తున్నట్టు సమాఖ్య జనరల్ సెక్రటరీ హరి లోకేష్ శర్మ తెలిపారు. కాకినాడ నగరంలో 36 నాట్యశాలలు ఉన్నాయని, వాటికి అనుబంధంగా రాష్ట్ర వ్యాప్తంగా 86 నాట్యశాలలకు సంబంధించిన సుమారు 850 మందికి పైగా నృత్య కళాకారులు, కళాకారిణులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారాన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కన్నబాబు, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొనప్పారు. శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ కోసం ప్రభుత్వం అన్ని సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. సమాఖ్య అధ్యక్షులు ఒవిఎన్.ప్రసాద్, కార్యదర్శి ఆనెం ప్రసాద్ పాల్గొన్నారు.

గోనె సంచుల్లేక రైతుల అష్ట కష్టాలు

ప్రజాశక్తి - సీతానగరం


గోనె సంచుల కోసం నిరీక్షిస్తున్న రైతు

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలూ పడుతున్నారు. ఒక పక్కన సంచులు లేక ఇబ్బందులు పడుతుంటే మరోపక్క రవాణా సౌకర్యం లేక ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సీతానగరం మండలంలో దాదాపు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్దా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను పొలంలో ఒబ్బిడి చేసి భద్రపరుస్తున్నప్పటికీ వాతావరణంలో తరచూ మార్పులు సంభవిస్తున్నాయి. అకాల వర్షం కురిసి ధాన్యం నీళ్ల పాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు లేకుండా నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్టు చెబుతున్నారు. అధికారులు మాటలు మాత్రం చెబుతున్నారని, అందుకు తగ్గట్టు చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతీ గ్రామంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సరిపడా సంచులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సరిపడా సంచులు ఇవ్వకుండా సప్లయ్ లేదని అంతంతమాత్రంగా అందిస్తుండడంతో మిగిలిన ధాన్యాన్ని ఏమి చేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. పండించిన మొత్తం ధాన్యం కళ్లంలోనే ఒబ్బిడి చేసుకున్నామని, ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని పట్టుబడి పట్టి ఎగుమతి చేయాల్సిందన్నారు. అయితే రవాణా సౌకర్యం కూడా రైతులే కిరాయి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రవాణా సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో పట్టుబడి పట్టిన ధాన్యం కేటాయించిన మిల్లులకు పంపేందుకు వీలు కలగడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక అయోమయ పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచుల కోసం ఆర్.బి.కెల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు రైతులకు కావాల్సిన సంచులను, రవాణా సౌకర్యం కూడా కల్పించాలని కోరుతున్నారు. లేకుంటే ధాన్యాన్ని తరలించడం చాలా కష్టమని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించాలంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా గోనె సంచులను సరఫరా చేయాల్సి ఉంది. తగినన్ని గోనె సంచులు అందుబాటులో లేవు. మిల్లర్ల దగ్గరే గోనె సంచులు ఉండడం వలన వారి నుంచి సంచులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతు భరోసా కేంద్రాలు వద్ద గోనె సంచులు అందుబాటులో ఉంచడం లేదు. మిల్లర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఆర్అండ్‌బి రహదారి

ప్రజాశక్తి - గోపాలపురం

గుంతలతో గోపాలపురం - దొండపూడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు గుంతలు పూడ్చేందుకు వేసిన బంక మట్టి వర్షాలకు తడవడంతో దానిపైనుంచి వెళ్లే వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపురం నుంచి దొండపూడి వరకు 12 కిలోమీటర్లు మేర రోడ్డు పెద్దపెద్ద గోతులతో అధ్వాన్నంగా తయారైంది వారంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి నిధులు మంజూరయ్యాయని చెప్పడమే తప్ప ఇప్పటివరకు రోడ్డు పనులు చేపట్టలేదని తెలిపారు. అయితే దొండపూడి నుండి గోపాలపురం మీదుగా తాడువాయి షుగర్ ఫ్యాక్టరీ కు వెళ్లేందుకు చెరుకు లోడు ట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గోతుల్లో పడి బోల్తా పడే ప్రమాదం ఉందని తెలిపారు. వర్షాలకు గుంతల్లో పూడ్చిన బంక మట్టి కరగడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. రోడుకు ఇలా పది నుంచి 15 వరకూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


రోడ్డుపై బంకమట్టి వేయడంతో జారిపోయిన ద్విచక్ర వాహనం

రాజకీయ చైతన్యం అవసరం

ప్రజాశక్తి-అమలాపురం

మాదిగలు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని బాపట్ల ఎంపి నందిగం సురేష్ అన్నారు. ఆదివారము అమలాపురంలో నిర్వహించిన మాదిగ రాజకీయ చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో వచ్చే ఎన్నికల్లో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం కేటాయించాలని మాదిగ పొలిటికల్ జెఎసి డిమాండ్ చేసింది. కార్యక్రమంలో పొలిటికల్ జెఎసి ఛైర్మన్ బొమ్మి ఇజ్రాయెల్, కాపు జెఎసి నాయకులు కల్వకొలను తాతాజీ, శెట్టిబలిజ నాయకులు కుడుపూడి సూర్య నారాయణరావు, వాసంశెట్టి సుభాష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పెదపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చైతన్య సభ సందర్భంగా పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సుమారు 500 మందితో భారీ 'పోలీసు బందోబస్తు' ఏర్పాటు చేశారు. **ఉప్పలగుప్తం** అమలాపురంలో ఆదివారం నిర్వహించిన ఈసభకు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. యువకులు మోటారు సైకిళ్ళ ర్యాలీ నిర్వహించారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు తొత్తరమూడి నరసింహారావు, చేట్ల విద్యాసాగర్, మడికి శ్రీరాములు, వంగలపూడి నరసింహామూర్తి, తదితరులు ఉన్నారు.


గోతులమయంగా ఉన్న నేలటూరు రోడ్డు

గోతులు పూడ్చాలని వినతి

ప్రజాశక్తి-మండపేట

మండపేట నేలటూరు రోడ్డు గోతుల మయంగా మారింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. సుమారు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డులో గోతులు పడడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎలక్ట్రానిక్ కాటాలు లేని ఏడు దుకాణాలపై కేసుల నమోదు

ప్రజాశక్తి -అమలాపురం


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌పి బాగ్చి ఆదేశాల మేరకు ఎస్‌పి పివి.రవి కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు బందాములుగా ఏర్పడి ఆదివారం చికెన్, మటన్ చేపల షాప్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం మండలంలో 14 చికెన్, మటన్ చేపల షాపుల్లో తనిఖీలు నిర్వహించి 7 షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవుట గుర్తించారు. మొత్తం 7 కేసులు నమోదు చేశారు. ఏడు షాపుల నందు తూకాల్లో ఎటువంటి వ్యత్యాసాలు లేవు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి పి.ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేశ్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి భార్గవ మహేశ్, కానిస్టేబుల్స్ వలి, లోవరాజు, ఈశ్వరరావు, వీరబాబు లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

జక్కంపూడి ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సీతానగరం


పూజలు నిర్వహిస్తున్న మండల వైసిపి కన్వీనర్ శీనివాసరావు

వైసిపి కేంద్ర కమిటీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్యం బాగుపడాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినకొండేపూడిలోని ఘంటా శ్రీనివాసరావు ఇంటి నుంచి సింగవరం విజయదుర్గ ఆలయానికి పాదయాత్రగా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్యం కుదుట పడాలని ఈ పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సలహాదారు చల్లమళ్ల సుజిరాజు, వైసిపి నాయకులు గద్దే వెంకటకష్ణ చౌదరి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కొండ్రాపు ముత్యాలు, మట్టా కాపు, మట్టా శ్రీను, మద్దాల కొండలరావు, సలాది వాసు, మనెల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న సిఐ

మృతుల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాల గ్రామ శివారు క్వారీ బ్లాస్టింగ్ ప్రమాదంలో మృతి చెందిన పాలోజు వరహాలు, లక్ష్మీ దుర్గ భవాని దంపతుల కుటుంబానికి ఆదివారం తుని రూరల్ సిఐ ఎ.సన్యాసిరావు, కోటనందూరు ఎస్ఐ స్వామి నాయుడు రూ.పది వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పార్టీలకతీతంగా కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-పెదపూడి

ఉషా పద్మినీ ఛాయా సౌంజ్ఞ సమేత శ్రీసూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవాలను పార్టీలకు అతీతంగా గ్రామంలోని ప్రజలు, యువత కలిసి జరుపుకోవాలని మాజీ జెడ్‌టిసి సత్తిభగవాన్ రెడ్డి సూచించారు. గొల్లలమామిడాడలో ఆదివారం కళ్యాణోత్సవాలను ఫిబ్రవరి 2న నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సమావేశంలో వివిధ ఏర్పాట్లపై చర్చించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మధు

రాజకీయాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కాకినాడ

కార్మికులకు దేశంలో రాష్ట్రంలో పాలకులు చేపడుతున్న విధానాలపై అవగాహన అవసరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. ఆదివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో జట్టు సంఘం కార్మికుల వనభోజనాల్లో ఆయన మాట్లాడారు. శతాబ్దాల కాలంగా అనేక పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దు చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేటర్ వ్యక్తులకు అమ్మివేస్తున్నారని, కార్మికులు ఐక్య పోరాటాలు ఉధతంగా చేస్తేనే మోడీ తగ్గుతారన్నారు. ఉదాహరణకు రైతు రైతు ఉద్యమం అని ఆయన అన్నారు. పాలకులు సహజ సంపద అయిన అడవులు, భూమి, నీరు, ఆకాశం వంటి ప్రకతి వనరులన్నీ అంబానీ ఆదానీలకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు పిఎస్ నారాయణ, సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ, నాయకులు పి.సత్యనారాయణ, బొమ్మసాని రవిచంద్ర, కె.జ్యోతిరాజు, త్రిమూర్తులు, రామకృష్ణ పాల్గొన్నారు.